

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట


## విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



వసతి గృహ వార్డెన్‌తో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వెల్దండ, నవంబరు 21 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, టాయిలెట్స్, ఆఫీస్, స్టాఫ్‌రూమ్‌లు తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్న బియ్యం, ఇతరసరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజ నాన్ని పరిశీలించినారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారికి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. బీసీ బాలుర వసతి గృహాన్ని కలియతిరిగి అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. వంటగదిని పరిశీలించి పరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. హాస్టల్ సంక్షేమ అధికారి వంటవారితో మాట్లాడి విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత పాటిస్తు న్నదీ లేనిదీ తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య కరమైన ఆహారాన్ని పరిశుభ్ర వాతావరణంలో వండించి ఇవ్వాలని కలెక్టర్ ఈ సందర్భంగా హాస్టల్ సంక్షేమాధికారిని ఆదేశించారు. మెనూ ప్రకారం ఆహారం అందించకపోతే తమకు తెలియజేయాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. బీసీ బాలుర వసతి గృహంలో ఉన్న150 మంది విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్లను అత్యంత పరిశుభ్రం గా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహంలో డ్రైనేజీ వ్యవస్థను నిర్వహణ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ లైట్లు ఏమైనా రిపేరు ఉంటే తక్షణమే చేయించాలని, చదువుతున్న విద్యార్థులకు ఎలాంటిసమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల పట్లనిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా అప్సర్‌నాజిమ్ అలీ, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, వెల్దండ తాహసిల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో సత్యపాల్, వార్డెన్ రామకృష్ణ తదితరులు వెంట ఉన్నారు.

## విద్యార్థులను ప్రోత్సహించాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి నవంబరు 21 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతంలో చదువుకునే విద్యార్థులకు సరైన సైన్స్ కిట్ అందించి వారికి సైన్స్ పై పట్టు కలిగే విధంగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం నుండి మూడు రోజుల పాటు నిర్వహించ నున్న 52వ రాష్ట్ర బాల వైజ్ఞానిక దర్శిని, 12వ ఇన్స్పిరేషన్ అవార్డుల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ లాంఛ నంగా ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ అంటే నిజం అని ఇది జీవితంలో చాలా ముఖ్యమైనదని అన్నారు. చాల సంవత్సరాల ముందు నుంచే విద్యాపరంగా వనపర్తి ముందు ఉంటుందని, పాలిటెక్నిక్ కళాశాల, పి.జి కళాశాల తదితర కళాశాలలు ఇక్కడ ఉన్నాయని ఇలాంటి ప్రాంతంలో వైజ్ఞానిక పరంగా కూడా ముందు ఉంచాడానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద రాజులు మాట్లాడుతూ నేటి నుంచి 3రోజుల పాటు సైన్స్ ఫెయిర్ తో పాటు కేంద్ర ప్రభుత్వ 12 వ ఇన్స్పిరేషన్ అవార్డు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ మొదటి వారంలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలకు పంపడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించే ఇన్స్పిరేషన్ అవార్డుల్లో మొదటిస్థానం పొందిన వారికి స్కాలర్ షిప్ సైతం అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రపంచం ఇంత వేగంగా అభివృద్ధి సాధించడానికి కారణం విజ్ఞాన శాస్త్రం అభివృద్దే అని, వనపర్తి జిల్లాలోని విద్యార్థులను విజ్ఞాన శాస్త్ర పరంగా అభివృద్ధిసాధించేందుకు ఉపాధ్యాయులు విద్యాబుద్దులు బాగా నేర్పించి ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని విద్యార్థిలోని నైపుణ్యాన్ని వెలికి తీసేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలియజేశారు. వనపర్తి జిల్లాకు ఉన్న విద్యాపర్తి జిల్లా పేరును మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ విద్యార్థులు తయారు చేసిన విజ్ఞాన ప్రదర్శనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్, మండల విద్యా అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పఠనాశక్తి పెంచుకోవాలి

- గద్వాల అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ



మెమోంటోలు అందిస్తున్న అదనపు కలెక్టర్, సీఈఓ

**గద్వాల నవంబరు 21 ప్రభాతవార్త:** విద్యార్థులు పఠనాశక్తి పెంచుకోవడం వల్ల మంచి ఆలోచన కలుగుతుందని దానివల్ల మెరుగైన సమాజాన్ని ఏర్పాటు చేయవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిపిఓ శ్యాంసుందర్ తో కలిసి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయ బలోపేతానికి గ్రామపంచాయతీల నుండి వచ్చే సెస్ అందేలా చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే నూతన భవన నిర్మాణ పనులు పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇతర ప్రాంతాలలో మున్సిపాలిటీలలో గ్రంథాలయాలు అన్ని సౌకర్యాలతో కూడుకున్నవని ఇక్కడ గ్రంథాలయ ఏర్పాటు చేస్తే అన్ని ఏర్పాట్లు ఉండేలా కృషి చేస్తామన్నారు. ప్రత్యేకంగా పాఠకులకు గదులు రికార్డుగది ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. గతంలో గ్రంథాల యాలలో దినపత్రికలు నవలలు మాత్రమే ఉండేవని ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలుసు కునే వారమని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధిం చేందుకు వారికి కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచడం వల్ల వారు పోటీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధిస్తారని ఎందుకు తగినట్లుగా విద్యపై ఆసక్తి గల దాతలను అన్వేషించి పుస్తకాలు సమ కూర్చుకోవాలని అన్నారు. విద్యార్థులు చదవడం పట్ల ఆసక్తి అలవరిస్తే వారికి మంచి ఆలోచనలు కలుగుతాయని దాంతో సరైన నిర్ణయం తీసుకునేందుకు వీలుంటుందని అన్నారు. ప్రస్తుతం సాంకేతిక యుగంలో ఉదయం పత్రికలు చూసే ఓపిక తక్కువ అయిందని ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి వరకు మొబైల్ ఫోన్లు వాడకం పెరిగిపోయిందన్నారు. మొబైల్ ఫోన్లను వాడవచ్చు కానీఅందులో విద్యకు సంబంధించినసమాచారం సేకరించి చదువుకు వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువుతోపాటు సంస్కారం ఉండాలని సంస్కారం లేని చదువు వ్యర్థమని అన్నారు. ఎందుకు భాస్కర శతకంలోని ఒక పద్యాన్ని వినిపించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరంఇటీవల నిర్వహించిన వ్యాసరచన తదితర పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులుఅందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, కార్యదర్శిశ్యాంసుందర్, గ్రంథాలయ కార్యదర్శి రామాంజనేయులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు సెంటర్ కోసం ఇరువర్గాల మధ్య ఘర్షణ



వడ్ల కొనుగోలు సెంటర్ కోసం గొడవ పడుతున్న ఇరు వర్గాలు

**గద్వాల, నవంబరు 21 ప్రభాతవార్త:** వడ్ల కొనుగోలు సెంటర్ నిర్వాహణ కోసం బీరెల్లి గ్రామంలో ఇరువర్గాలు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వడ్ల కొనుగోలు సెంటర్ లను ఐ కేపీ సెంటర్ ద్వారా రైతుల నుండి వడ్ల కొనుగోలు ప్రభుత్వం నిర్వహిస్తుండగా గద్వాల మండలం బీరేల్లి గ్రామంలో అధికార పార్టీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి వడ్ల కొనుగోలు సెంటర్‌లో ఆధిపత్యం కోసం గొడవకు దిగారు. వడ్ల కొనుగోలు సెంటర్ తమ వర్గానికే ఇవ్వాలని కొనుగోలు సెంటర్ ప్రారంభం కాకుండా ఇరు వర్గాలు ఘర్షణకు దిగారు. గత సంవత్సరం మహిళా సంఘాల వారికే వడ్ల కొనుగోలు సెంటర్ ను ఈ సంవత్సరం కూడా ఇవ్వాలని కొందరు పట్టు పడగా రాజకీయ కారణంగానే బీరేల్లి గ్రామ కొనుగోలు సెంటర్‌ను ఈ సంవత్సరం వేరే మహిళా గ్రూప్‌లకు ఇచ్చారాని గత సంవత్సర మహిళా సంఘాల గ్రూప్ వారు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా గద్వాల నియోజకవర్గంలో అధికార పార్టీ లోని నాయకులు రెండు వర్గాలుగా విడిపోవడం తో గ్రామాలలో కూడా రెండు వర్గాలుగా కార్యకర్తలు, నాయకులు విడిపోయి ఆధిపత్య పోరుతో గ్రామాలలో ఘర్షణ వాతావరణం నెలకొంది.

## తీరు మారలే..

- అల్పాహారంలోనూ పురుగులే దర్శనం
- సాక్ష్యాత్తు కలెక్టర్ విచారణలో వెలుగు చూసిన వైనం
- తిరిగి వేరే భోజనం వండి వడ్డించిన సిబ్బంది
- మాగనూరు ఘటనపై ఎంఈవో, హెచ్‌ఎం సస్పెండ్, వంట ఏజెన్సీ రద్దు



విద్యార్థినిలతో మాట్లాడుతున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, మాగనూరు, నవంబరు 21 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారినా సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినా మాగనూరు పాఠశాల పరిస్థితి మారలేదు. మాగనూరు మండల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మళ్లీ సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. గురువారం అధికారుల సమక్షంలో మధ్యాహ్నభోజనం వడ్డించగా అందులోపూ పురుగులే దర్శనమివ్వడంతో విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్డీవోతిరిగిఅన్నంమళ్లీ వండించి సుమారు 3గంటలప్రాంతంలో విద్యార్థులకు వడ్డించారు. గురువారం మళ్లీపురుగుల అన్నం దర్శనమివ్వడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**ఎంఈవో సస్పెండ్..**

మధ్యాహ్న భోజనం వికటించి సుమారు 110మంది పైగా విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం నారాయణపేట జిల్లా మాగనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులు ఒక్కక్కరుగా అస్వస్థతకు గురి కావడంతో సీరియసగా ఉన్న 15మంది విద్యార్థులను మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇదే ఘటనపై సీరియస్ అయ్యారు. ఈ ఘటనకు సంబంధించి సీఎంవోనే పూర్తి నివేదిక అందజేయమని కోరారు. గురువారం ఎంఈవో మురళీధర్‌రెడ్డి, ఘటన జరిగే సమయంలో ఇన్‌చార్జిగా ఉన్న బాబురెడ్డిని సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు అందినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఘటనకు సంబంధించిన పూర్తి నివేదిక ప్రభుత్వానికి చేరినట్లు సమాచారం. అయితే తమ ఉపాధ్యాయులు తమకు కావాలని కోరుతూ విద్యార్థులు రోడ్డుపై కాసేపు భైటాయించారు. పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



వంట సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్

**పేట కలెక్టర్ విచారణ..**

నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘ టనపై గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మాగనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఆ పాఠశాల వంట గదిని, స్టోర్ రూంను, వంటకు వినియోగించే బియ్యాన్ని, స్టోర్‌రూంలోని నిత్యావసరాల సరకులను పరిశీలించారు. జరిగిన సంఘటన గురించి పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై ప్రతిరోజు మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు పరిశీలించి, రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సంఘటనలో 17 మంది విద్యార్థులకు వాంతులతో అస్వస్థత కలిగిందని, హుటాహుటిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ సలహాతో మక్తల్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ -మిగతా4లో..



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

## పోలీసు విధి కత్తి మీద సాము లాంటిది

- దేశ సేవకు పంపిన తల్లిదండ్రులకు అభినందనలు: విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్, ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి





పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జడ్చర్ల, నవంబరు 21 ప్రభాతవార్త:** పోలీసు విధి, చేసే డ్యూటీ కత్తి మీద సాము లాంటిది అని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్, ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి అన్నారు. జడ్చర్లలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ఎస్‌సిటి పిసిఎస్ పాసింగ్ ఔట్ పరేడ్ కి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం, జడ్చర్ల నందు 270 మంది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కి చెందిన ఎస్‌సిటి పిసిఎస్ (స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్) (సివిల్( 9 నెలల ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పాసింగ్ అవుట్ పరేడ్ శిక్షణ, క్రమ శిక్షణా ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది. దేశ సేవ చేయడానికి ఇంత మంచి ఉత్తమ పౌరులను కన్నతల్లిదండ్రులు, మీరు వీరిని పోలీసు శాఖకు అప్పగించినందున అభినందనలు తెలిపారు. ఒక చిన్న తప్పు చేసిన అది శాఖ మొత్తానికి ఆపాదించే ప్రమాదం ఉంటుందని, కాబట్టి ఒక రకంగా మన యొక్క విధులు బాధ్యతలు కత్తి మీద సాములాంటివన్నారు. ప్రజల్లో ఈరోజుకు పోలీస్ శాఖ మీద ఉన్న గౌరవం, అభిమానం రాష్ట్రంలోని దేశంలో గాని ఏ శాఖకు లేదని అన్నారు. తన 30 సంవత్సరాల అనుభవంతో గర్వంగా చెబుతున్నానని ఎందుకంటే ప్రజలకు తెలుసు మనంత్యాగాలు చేస్తున్నామని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా రాత్రిపూట నిద్రపోవాలంటే మనం మేల్కొని పనిచేస్తున్నామని, వారు ప్రశాంతంగా పండుగలు ఉత్సవాలు జరుపుకోవాలని మనం మన ఇండ్లలో పండగలు పబ్బాలను పక్కనపెట్టి వాళ్ల యొక్కప్రశాంతత కోసం పనిచేస్తున్నాం అందుకనే పోలీసు శాఖకు అంతటి గౌరవం వుందన్నారు. డిటిసి వైస్ ప్రిన్సిపాల్ నరసింహులును డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జోన్7 జోగులాంబ, డిఐజి ఎల్ఎస్‌చౌహాన్ ఐపీఎస్, జిల్లా ఎస్పీ డి జానకి, వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, డిటిసి ప్రిన్సిపాల్ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డిటిసి వైస్ ప్రిన్సిపల్ నర్సింలు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాస్, డిసిఆర్‌బి డీఎస్పీ రమణారెడ్డి మరియు ఇతర పోలీసు ఉన్నత అధికారులు మరియు ఎస్‌సిటి పిసిఎస్ పోలీసు కుటుంబసభ్యులు పాల్గొంటారు.

## ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

### ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట టౌన్, నవంబరు 21 ప్రభాతవార్త:** జిల్లా పరిధిలో నిత్యం శాంతి భద్రతలు పరిరక్షిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించి అట్టి కేసులలో సరైన సాక్ష్యధరలను సేకరించి సాంకేతికతను జోడించి త్వరగా కేసులను చేదించాలని ఎస్పీ తెలిపారు. గురువారం ఉదయం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అధికారులను అడిగి తెలుసుకొని పెండింగ్ కేసులనున్యాయ అధికారాలతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్‌కేసులను త్వరగాపూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏ ఏ అంశాలు కోడికరించాలి తదితర అంశాల గురించి ప్రొజెక్టర్ ద్వారా చూపిస్తూ అధికారులకు వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నేరాలు జరిగిన వెంటనే తగిన సాక్షాదారణ సేకరించి సాంకేతిక పరిజ్ఞానంతో కేసులనుత్వరగా చేదించాలని సూచించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలి. కేసునమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి ఛాలెంజ్ గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలి అని తెలిపారు. జిల్లాపరిధిలో నేరాల నియంత్రణపై దృష్టిసాధించాలని పాత నేరస్తులు జైలు నుండి విడుదలైన వారి పై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేయాలని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి సిసి కెమెరాల ఆవశ్యకత గురించి గ్రామాలలో పట్టణాలలో ఆయాపోలీస్ అధికారులు సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, హైవే, నేషనల్ హైవేలపై సైన్‌బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, జిల్లా పరిధిలో నిత్యం స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించి ఆకస్మిక వాహనాల తనిఖీలుచేపట్టాలని అధికారులకు -మిగతా4లో..

## రైతును రాజుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఆరేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ఆత్మకూరు నవంబరు21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని ఆరే పల్లి గ్రామంలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన రైతులను దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో రైతులకు వరి ధాన్యం క్వింటాలకు బోనస్ ఇవ్వకుండా టిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసానికి గురిచేసిందని రైతుగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి రైతుల బాధలను విని క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ చెల్లించేందుకుదృఢమైన నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు. గత పది సంవత్సరాల కాలం నుండి ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో 70 లక్షల మెట్రిక్టకు పైగా వరిధాన్యం పండించడం భారతదేశ చరిత్రలోనే రికార్డుగా ఆయన పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ప్రకటించడమే వరి ధాన్యం దిగుబడి పెరిగినట్లుగా ఆయన పేర్కొన్నారు నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసినటువంటి కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీఇచ్చారు. రైతులు దళారులను నమ్మిమిల్లర్లకు ధాన్యాన్ని విక్రయించకుండా మోసాలకు ఉరికా కూడదని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు తహశీల్దార్‌చాంద్ పాషా, సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీఉపాధ్యక్షులు మొగిలిగంగాధర్‌గౌడ్, మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజుయాదవ్, ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా, ఆత్మకూరు మున్సిపల్ టౌన్ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు దామోదర్, నాగేష్, వెంకటన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో సర్కారు బడులు నిర్వీర్యం..

- దవాఖానల్లో మందులు,సిబ్బంది కొరత
- మాగనూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను పరామర్శించిన మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం



విద్యార్థులను పరామర్శిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు21, ప్రభాతవార్త:** కలుషిత ఆహారం తిని అనారోగ్యం బారిన పడ్డ మాగనూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను మహబూబ్నగర్ జనరల్ ఆస్పత్రిలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి గురువారం పరామర్శించారు. అనంతరం మీడియాతో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు వస్తే ఇక్కడ పురుగుల అన్నం పెట్టారని, ఇచ్చిన టిఫిన్ లో పురుగులు తీసేసామని ఆస్పత్రి సిబ్బంది చెప్తున్నారని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇదే విషయం చెబుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వచ్చే రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసుపత్రుల్లో మందులు..వైద్యుల కొరత ఏర్పడిందన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకు ఎక్కువ డిమాండ్ ఉండేదని, నాణ్యమైన భోజనంతో పాటు ప్రమాణాలతో కూడిన విద్య గురుకుల పాంశాలలో సాగేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకుల పాఠశాలలతో పాటు సర్కారు బడులను పూర్తిగా నిర్వీర్యంచేసిందని దుయ్యబట్టారు. నాణ్యమైన భోజనం అందక చాలామంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

## ముగిసిన శ్రీకురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి ఆభరణాలను అధికారులకు అప్పజెబుతున్న ఆలయ అర్చకులు

**చిన్నచింతకుంట, నవంబరు 21 ప్రభాతవార్త:** పల్లె ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీకురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈనెల 2 నుంచి ప్రారంభమైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు 20 రోజులపాటు కొనసాగాయి. ఈ బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి శ్రీదేవి భూదేవి సమేత శ్రీకురుమూర్తి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈనెల 18న స్వామి వారి ఆభరణాలు తొలగింపు చేయాల్సి ఉండగా భక్తులు, వ్యాపారస్తుల వినతి మేరకు మూడు రోజులపాటు పొడిగించి గురువారం రోజున స్వామివారి ఆభరణాలను ఆలయ అర్చకులు తొలగించి స్వామివారి ప్రధానాలయంలో అధికారులు, దేవస్థానం అధికారులు, అర్చకులు ఒక్కొక్క ఆభరణాలులెక్కించి ఆభరణాలపెట్టెలో భద్రపరిచారు. ఆభరణాల పెట్టెను ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి సన్నిధి నుంచి దేవస్థాన చైర్మన్ గౌనిగోవర్ధన్‌రెడ్డి స్వామివారి ఆభరణాలు పెట్టను తలపై ఉంచుకొని మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ కొండదిగువకు తీసుకొచ్చారు. -మిగతా4లో..

## ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



**భూత్పూర్, నవంబరు 21, ప్రభాతవార్త:** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గురువారం భూత్పూర్‌లో మండల, పట్టణ మత్స్య కారులు ఘనంగా నిర్వహించారు. మత్స్యకారులంతా ఏకమై భూత్పూర్ చౌరస్తా నుంచి ర్యాలీగా వెళ్లి శివాలయం వద్ద ప్రత్యేక సమా వేశం ఏర్పాటు చేసుకుని తమ సాధక బాధకాలు చర్చించుకున్నారు. శివాలయం ఆవరణలో కేక్ కట్ చేసి పరస్పరం స్వీట్లు పంచు కున్నారు. ఈ సందర్భంగా మత్స్యకార సహకార సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణ మట్లాడుతూ మత్స్య కారులను బీసీ డి నుంచి బీసీ ఏ గ్రూపులో చేర్చాలని పలు మార్లు వినతులు సమర్పించినప్పటికి ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో బీసీలలో మత్స్య కారులకు ప్రత్యేక స్థానంతో పాటు రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. మత్స్యకారులను బీసీడి నుంచి బీసీ ఏ చేర్చేంతవరకు మత్స్యకారులంతా ఏకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మత్స్యకార సంఘం భూత్పూర్ మండల అధ్యక్షుడు గొడుగు వెంకటరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముత్యాల ఎర్రబాలప్ప, మూష సాయిలు, పులగుర్ల మల్లేష్, జైదు శ్రీనివాసులు, ఎంకంపల్లి మల్లేష్, మేకల సత్యానారాయణ, గంగాపురం రవీందర్, ఆకుల వెంకట య్య, ఆకుల రాములు, బోల వెంకట్రాములు, పట్నం రాములు, చీపుర్ల భీంసేన్, గొడుగు రాజు, గొడుగు వేణుగోపాల్, పులగుర్ల నాగరాజు, ప్రతాప్, వెంకట్రాములు, నరేందర్, పులగుర్ల రాములు పాల్గొన్నారు.



**ఖిల్లాఘణపురం నవంబరు 21 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ముదిరాజ్ కులానికి చెందిన వారి ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య కారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా మత్స్యకారుల సంఘం ఉపాధ్యక్షులు అనలేని కృష్ణయ్య గురువారం స్థానిక బస్టాండ్ ఆవరణలో మత్స్య కారుల జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభను ఏర్పాటు చేసి పది సంవత్సరాలు అవుతుందని రాష్ట్రంలో ముదిరాజులు వెనుకబడి ఉన్నారని రాజకీయంగా ఆర్థికంగా ముందుకు తీసుకుపోవడానికి ముదిరాజుల అందరూ ఐకమత్యంతో కలిసి మెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. డిసిడిలో ఉన్న ముదిరాజులను బీసీఏలోకి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు గతంలో మోటార్ సైకిల్‌ను చేపల అమ్ముకోవడానికి వ్యాన్లు సబ్సిడీపై అందజేశారని, వాటిని పునరుద్ధరించి మత్స్య కార్మికులను ఆదుకోవాలని చెప్పారు. ఈ ఉత్సవంలో పాల్గొనడానికి మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్దలు యువకులు తరలివచ్చారు. గోనెల శ్రీనివాస్‌దేవేందర్, రాములు. చెన్నయ్య యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు మధు గోనెల శంకర్, రామచంద్రయ్యలు పాల్గొన్నారు.



**వనపర్తి టౌన్ నవంబరు 21 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో గురువారం మత్స్య పారిశ్రామిక సొసైటీ సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులు జెండా ఆవిష్కరించి ఘనంగా సంబరాలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారుల కుల పెద్ద గోకం రాఘవేంద్ర మాట్లాడుతూ అత్యంత పురాతన చరిత్ర కలిగిన వంశం మత్స్యకారుల వంశమని పేర్కొన్నారు. మహాభారతం లోని పాండ వుల చరిత్రే మత్స్యకారుల చరిత్ర అని మత్స్యకారులందరూ ఐకమత్యంతో ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ మున్సిపల్ ఛైర్మెన్ పుట్టపాకల మహేష్, బొలెమోని లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, కాగితాల లక్ష్మినారాయణ, కంచరవి, నందిమల్ల చంద్రమోళి, బొలెమోని కృష్ణయ్య, ఉండేకోటి లక్ష్మయ్య, నందిమల్ల రమేష్, ఎర్ర మన్యం సంఘం సభ్యులు కుల పెద్దలు యువకులు పాల్గొన్నారు.



**పెబ్బేరు నవంబరు 21 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో మత్స్ పారిశ్రామిక సంఘం భవనంలో గురువారం రోజు ఘనంగా ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవం సందర్భంగా పెబ్బేరు మున్సిపాలిటీలో మత్స్య కార్మిక దినోత్సవాన్ని ముదిరాజుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకోవడం జరిగింది. ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్ ముదిరాజ్ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్రం ముదిరాజులకు ఇచ్చిన 10 రకాల హామీలు వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార మండల అధ్యక్షుడు గోల్డ్ బాలస్వామి, మత్స్యకార సంఘం అధ్యక్షుడు చింతకాయల కురుమూర్తి, సెక్రటరీ మహేష్, గోనేల సహదేవుడు, భీముడు యువజన సంఘం అధ్యక్షులు సంగన మోని శ్రీనివాసులు, అధ్యక్షుడు గోనేల భరత్, వెంకటేష్, దేవి ప్రసాద్, నరసింహ, రఘు, కటికేలా పురుషోత్తం, రాముడు, ఎల్లస్వామి ఈ కార్యక్రమంలో ముదిరాజ్ బంధు మిత్రులు పాల్గొన్నారు.

## సదర్ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**మక్తల్‌టౌన్, నవంబరు21 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈనెల 25న ప్రతిష్టా త్మకంగా జరగనున్న సదర్ ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా మక్థల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని అఖిల భారత యాదవ మహసభ జిల్లా బృందం ఆహ్వానించింది. ఎమ్మెల్యే నివాస గృహంలో కలిసి, ఆయనను శాలువాతో సత్కరించి, 25వ తేదీ సాయంత్రం జిల్లా కేంద్రంలో జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ... సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షించదగిన విషయం అన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొంటారని, జిల్లా వ్యాప్తంగా ఉన్న యాదవ కుటుంబ సభ్యులు అందరూ 25వ తేదీ జిల్లా కేంద్రానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహసభ జిల్లా అధ్యక్షుడు బాలప్ప యాదవ్, కన్వీనర్ రఘువీర్ యాదవ్, మక్థల్ నియోజకవర్గ అధ్యక్షుడు నర్సిములు యాదవ్(వనయకుంట), నగేశ్ యాదవ్ (పంచలింగాల), గోపాల్ యాదవ్, రాజు యాదవ్, చిన్నన్న యాదవ్, క్రిష్ణ యాదవ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధాతో పెట్టుబడులు తగ్గి..దిగుమతి పెరగాలి

### పుస్తకావిష్కరణలో పాలమూరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాస్, అధ్యాపక బృందం

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు21 ప్రభాతవార్త:** వ్యవసాయ లో కృతిమ మేధాను అనుసం ధానం చెయ్యడం ద్వారా పెట్టుబడుల ఖర్చులు తగ్గి, అధిక దిగుబడులు పొంది రైతే రాజు కావా లని పాలమూరు విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య శ్రీనివాస్ ఆకాంక్షించారు. "కృతిమ మేధా అనుసంధానంతో వ్యవసాయం, వలసలు" అనే పుస్తకాలను గురువారం ఆవిష్కరించిన ఉపకులపతి ఆచా ర్య శ్రీనివాస్ ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా కృత్రిమ మేధా పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని, దాని ద్వారానే పరిశోధనలు చేసి విద్యారంగ అభివృద్ధికి, సామాజిక వ్యవస్థ మరియు ప్రభుత్వ ప్రైవేట్ రంగాల త్వరితగతిన అభివృద్ధి సాధించడానికి ఉపయోగపడతాయని కొనియాడారు. పుస్తక రచయిత అర్థం శాస్త్రం విభాగం అధ్యాపకులు డా. వెంకట రాఘవేంద్రను వీసీ అభినందించారు. ఓ ఎస్ డి మధుసూదన్ రెడ్డి , సమన్వయకర్త డా కే ప్రవీణ, సంయుక్త సంచాలకులు డా అంకం భాస్కర్, విభాగాధిపతి డా జిమ్మీ కార్టన్, ప్రిన్సిపాల్ డా చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా కృష్ణయ్య, డా అనురాధ తదితరులు ఉన్నారు.

## 28న జిల్లా స్థాయిలో చెక్‌ముఖి సైన్స్ ప్రతిభ పోటీలు

**ఇటిక్యాల, నవంబరు 21 ప్రభాతవార్త:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన జిల్లా స్థాయిలో విద్యార్థులకు చెక్ ముకి సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక నాయకులు తెలిపారు. అందులో భాగంగా గురువారం మండల స్థాయిలో చెకుముకి సైన్స్ పోటీల ప్రతిభ పరీక్ష ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల్లో 8,9 మరియు 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. సైన్స్ పరీక్ష పోటీలలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు. మునగాల గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెకి ముకి సైన్సు పోటీలలో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అంతేకాక 28వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో కూడా పాల్గొని ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాగుంట. జన విజ్ఞాన వేదిక మండల ప్రెసిడెంట్ శేఖర్ బాబు. కార్యదర్శి సురేఖ. ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాస్ రెడ్డి, తవిటి నాయుడు, విష్ణు, బీసన్న, తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌ముఖి క్రీడల్లో మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి ఎంపిక

**లింగాల, నవంబరు 21 ప్రభాతవార్త:** చెకుముకి క్రీడల్లో మండల స్థాయిలో రాణించి జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ తెలిపారు. తెలుగు మీడియంలో పి. సందీప్ రాథోడ్, యస్. రాజేశ్వరి, ఏ. వాణిముగ్గురు విద్యార్థులు, ఇంగ్లీష్ మీడియంలో యం. యశ్వంత్, కె. శివ, కె. స్వధన్ దీప్ రాథోడ్ ముగ్గురు విద్యార్థులు, మొత్తం 6 మంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చెకుముకి క్రీడల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపికైయ్యారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ హెచ్ఎం కొండయ్య, నరసింహులు, రామచంద్రయ్య, కవిత రాణి, సురేష్ పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జాగ్రత్తగా నిర్వహించాలి

◆ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, సీఈఓ కాంతమ్మ

**గద్వాల నవంబరు21 ప్రభాతవార్త:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి నారాయణ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్వే పూర్తయిన తర్వాత సర్వే ఫారాలలోని అన్ని వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయాల్సి ఉంటుందని, వివరాల నమోదు విషయంలో ఆపరేటర్లు ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు ఫీల్డ్ విసిట్ పూర్తిచేసిన వెంటనే, వారి సమక్షంలోనే డేటా ఎంట్రీ ప్రారంభించాలని అన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఇప్పటికే గుర్తించి, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చడం జరిగిందని తెలిపారు. మండల స్థాయిలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. ఆపరేటర్లు కంప్యూటర్లో నమోదు చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా పరిశీలించాలని, ఆ ఫారాలలో ఏం ఉంటే ఆ వివరాలనే నమోదు చేయాలని తెలిపారు. కుటుంబ వివరాల నమోదును గోప్యంగా ఉంచాలని అన్నారు. మండలాల లాగిన్‌లకు యూజర్ ఐడీలు, పాస్‌వర్డులు అందజేస్తామని అన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు సర్వే సాఫ్ట్‌వేర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లు డేటా ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. శిక్షణలో డేటా ఎంట్రీ విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్లకు వివరించినట్లు పేర్కొన్నారు. ఈ సర్వేను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, సర్వే విజయవంతం కోసం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ కాంతమ్మ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయత్ రాజ్, మున్సిపాలిటీ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన తీసుకోవాలి

### ఎస్సి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జెయం మిషేక్



మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్సి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

**కొత్తకోట నవంబరు21 ప్రభాతవార్త:** కొత్తకోట మండలంలోని ఆమడబాకుల మోడల్ స్కూల్ బాలికల హాస్టల్లో కేర్ టెకర్ తో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని బాలికలను కాపాడాలని వనపర్తి జిల్లా ఎస్సి ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జెయం మిషేక్ అన్నారు. గురువారం ఆమడబాకుల మోడల్ స్కూల్ ను పరిశీలించారు. ఈ నెల 18 న జరిగిన సంఘటనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన రవి కుమార్ యాదవ్ గత 2,3 సంవత్సరాలనుండి హాస్టల్ కు వస్తు పోయేవాడని విద్యార్థులు వివరించారు. 18న రాత్రి జరిగిన సంఘటనపై ఎమ్ఈవో కృష్ణయ్య, మరో జిల్లా అధికారి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేసినట్టే చేసి వదిలేశారని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగాశిక్షించాలని మిషేక్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యబుద్దులు నేర్పించాల్సిన వారే ఇలాంటి చర్యలకు పాల్పడడం సరైనది కాదని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్. కేర్ టెకర్, ఏఎన్ఎమ్, వాచ్మెన్‌సస్పెండ్ చేయడం సంతోషించదగ్గ విషయమే కానీ ఈ చర్యలకు పాల్పడిన రవి యాదవ్ ను కూడా వెంటనేఅరెస్ట్ చేసిచట్టప్రకారం శిక్షించాలని కోరారు. లేకపోతె కలెక్టర్, జిల్లా ఎస్పీకి పిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఇంత జరిగినఈ సంఘటనను అంత గోప్యంగా ఎందుకు ఉంచుతున్నారని అధికారుల సైతం రవి కుమార్ యాదవ్ కు వత్తాసు పలుతున్నారని మండిపడ్డారు. ఈ సంఘటన జరిగింది నేటికీ 3 రోజులు అవుతున్న ఇంత వరకు హాస్టల్ కు సిబ్బందిని నియమించలేదని రాత్రి పూట విద్యార్థులు భయందోళనలకు గురవుతున్నారని వెంటనే సస్పెండ్ అయిన వారి స్థానంలో వేరేవాళ్లను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం మోడల్ స్కూల్ లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు డ్రైనింగ్ రూమ్ లేనందున ఆరు బయటే కూర్చొని భోజనం చేస్తున్నారని వెంటనే వారికీ డ్రైనింగ్ హల్ ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భాజపా అధ్యక్షుడు నారాయణ

**వనపర్తి టౌన్ నవంబర్21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్య లపై బిజెపిజిల్లా అధ్యక్షులు డి.నారాయణ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ ప్రజా కవి కాళోజి చెప్పినట్లు ప్రాంతం వాడు మోసం చేస్తే పాతిపెట్టాలంటే మొదటగా తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డిని పాతి పెట్టాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎత్తిన బుడ్డర్ ఖాన్ రేవంత్ రెడ్డికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి గురించీ మాట్లాడే అర్హత లేదనిఅన్నారు. రాష్ట్ర సాధనకై పోరుయాత్ర చేసి పార్లమెంటులో బిల్లు పాస్ కావాలని నిరాహారదీక్ష చేస్తే రేవంత్ రెడ్డి సమైక్యాంధ్ర భజన చేస్తూ పూటకో పార్టీ మారే అవకాశవాది అని తెలంగాణ రక్తపిశాచి సోనియా గాంధీ కాళ్లు పట్టుకొని ముఖ్యమంత్రి అయ్యారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ఏర్పాటుకు మోదీ ఏనాడు అడ్డుపడలేదని రాష్ట్ర అభివృద్ధికై 13 లక్షల కోట్లు నిధుల లెక్కలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారనన్నారు. రేవంత్ రెడ్డి 6 గ్యరెంటీలు అమలు చేయలేక అవాకులు చవాకులు పేలుతున్నారని ఇచ్చిన వాగ్దానాలు నిలుపుకోకపోతే కాంగ్రెస్ పార్టీకి ఏ విధంగా కర్ర కాల్చి వాత పెట్టాలో రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలు నిర్వహించే దమ్ము ధైర్యం రేవంత్‌రెడ్డికి లేదని ఏడాది కాలమైన మంత్రి వర్గాన్ని విస్తరణ చేయలేని దద్దమ్మ రేవంత్ రెడ్డి అని భాజపా గురించి నరేంద్ర మోడీ గురించి విమర్శిస్తే భాజపా కార్య కర్తలు తగినగుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్ సర్పంచ్ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కర రామన్ గౌడ్ జిల్లా అధికార ప్రతినిధి మీడియా ఇన్చార్జి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రాణాలు పోతున్న ప్రభుత్వానికి పట్టింపు లేదు

**మక్తల్, నవంబరు21 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల ప్రాణాలకు పూర్తిగా భద్రత కరువైందని, ప్రతిరోజు విద్యార్థుల ప్రాణాలు పోతున్న ప్రభుత్వానికి పట్టింపు లేకపోయిందని బిజెపి జిల్లా సభ్యత నమోదు కో కన్వీనర్ గవినోళ్ల ప్రసన్నా బలరాం రెడ్డి అన్నారు. మాగనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించి దాదాపు 110 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురి కావడం వెనుక ప్రభుత్వ బాధ్యత రాహిత్యం ఉందన్నారు. రోజు రోజుకు రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆమె అన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించడంతోపాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం చూస్తుంటే విద్యా శాఖ పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టకపోతే బిజెపి ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు.

## రూ.1921 ధర పలికిన హంస

**దేవరకద్ర, నవంబరు21 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు గురువారం రైతులు 9 కింటాళ్ల హంస ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.1921 ధర పలికింది. అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది. అలాగే 688 కింటాళ్ల ఆర్ఎన్ఆర్ ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్ ధాన్యానికి రూ. 2592 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ. 2029 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

**ఉప్పునుంతల, నవంబరు21 ప్రభాతవార్త:** సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను గురువారం మండలంలోని లబ్ధిదారులకు అందజేశారు. సిఎం సహాయనిధితో పాటు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ తదితర పథకాలకు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి తో పాటు అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, సదగోడు మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, బిసి సెల్ నాయకులు మెడమోని భాస్కర్, కల్వ గోవర్ధన్ రెడ్డి, మర్రి పల్లి మాజీ ఎంపిటిసి నాగటి మల్లయ్య, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రత్లావత్ కృష్ణ, రతన్ సింగ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన కలెక్టర్



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, నవంబరు 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణ కోసం గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. సింగారం మలుపు దారిలో గల జిల్లా నూతన కలెక్టరేట్ సముదాయం సమీపంలోని స్థలంతో పాటు డిఆర్డిఓ కార్యాలయ పక్కనున్న స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. జిల్లా మహిళా సమాఖ్య భవన డిజైన్ ఆధారంగా స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం డిఆర్డిఓ కార్యాలయం వెనక భాగంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే పెట్రోల్ బంక్ ను కలెక్టర్ పరిశీలించారు.

## గద్ద శ్రావణ్ కుమార్‌కు డాక్టరేట్ అవార్డు

**లింగాల, నవంబరు21 ప్రభాతవార్త:** లింగాల మండలంలోని ఆవుసలికుంట గ్రామానికి చెందిన గద్ద శ్రావణ్ కుమార్ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా స్వంత గ్రామంలోనే ఉంటూ బిఏ బిఈడి, ఎంఏ తెలుగు పూర్తి చేసి 2014 నుంచి 2024 వరకు నిరుపేద విద్యార్థులకు చదువును సామాజిక నేర్పుతూ ఇతను సహకారంతో 108 మంది విద్యార్థులు ఆయా గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. అదేవిధంగా వివిధ పాఠశాల, జూనియర్‌కళాశాల విద్యార్థులకు కోచింగ్ ఇస్తూ పరీక్షలు వ్రాయించి ఎంపిక చేయిస్తున్నాడు. చదువును మధ్యలో మానేసిన విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఓపెన్ పదవతరగతి, ఇంటర్, డిగ్రీలో చేర్పిస్తున్నాడు. బుధవారం హైదరాబాద్‌లో హిమాయత్ నగర్ లో ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ ఫౌండేషన్ డాక్టర్ రేట్ అవార్డు, సర్టిఫికెట్ గోల్డ్ మెడల్ అందజేసి శాలువాతో సత్కరించారు.

## వికలాంగురాలికి కుట్టు మిషన్ వితరణ

**పెబ్బేరు నవంబరు21ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని యాపర్ల గ్రామానికి చెందిన మాల మహేశ్వరికి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖరరెడ్డి ఆర్థిక సహాయం తో గురువారం కుట్టు మిషన్‌ను అందజేశారు. వివరాల్లోకి వెళితే యాపర్ల గ్రామానికి చెందిన మాలమహేశ్వరికి గ్రహణమొర్రి చెవులు సరిగ్గా వినపడవు, అదేక్రమంలో మాటలు సరిగ్గా రావు. విషయం తెరాస యువ నాయకుడు వడ్డెరమేష్ దృష్టికి తీసుకొచ్చారు. తను మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖరరెడ్డి దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించారు. కష్టకాలం లో నిజమైన నాయకులు అంటూ రావుల చంద్రశేఖర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యాపర్ల మాజీ సర్పంచ్ ఆనంద్, అడ్వకేట్ కిషోర్ కుమార్ రెడ్డిలు కుట్టుమిషన్‌ను మహేశ్వరికి అందించారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, మునిస్వామి, రామకృష్ణ, గోఖారి, రవిగౌడ్, అంజి, బాలకృష్ణ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌ముఖి సైన్స్ పోటీలలో తపోవన్ విద్యార్థుల ప్రతిభ

**దేవరకద్ర, నవంబరు 21 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలో గురువారం నిర్వహించిన చెకుముచ సైన్స్ పోటీలలో తపోవన్ విద్యార్థుల ప్రతిభచాటారు. స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో జన విజ్ఞాన వేదిక అధ్వర్యంలో మండలస్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోటీలలో తపోవన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సాయిప్రణవి ప్రతిభ చాటింది. అలాగే 9వ తరగతి నుండి కరుణశ్రీ, 10వ తరగతి నుండి వికాస్‌రెడ్డిలు ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలో జరుగు పోటీలలో వారు పాల్గొంటారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారిబలరాం, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలింగం, చెకుముచ పోటీల నిర్వహకులు వేణుగోపాల్‌లు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తపోవన్ పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రయ్య, నరసింహ్మలు, అమీర్, అమర్నాథ్, అనురాధ, ఉమ, సబిహా, అపర్ణ, పావని, కళ్యాణి, స్వప్న, శిరీష, భార్గవి, గౌతమి, కరిష్మ, రీతు, కనీస్, స్వప్న, మౌనిక పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నదాన సత్రం నిర్మాణానికి భూమి పూజ

**ముసాపెట్, నవంబరు 21 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సంకల్ప సిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రంలో దాతల సహకారంతో గురువారము అన్నదానసత్రం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సత్రం నిర్మాణం దాదాపు పది లక్షల పైగా ఖర్చు అవుతుందని అన్నదాన సత్రానికి దాతలు సహకరించాలని సంకల్ప సిద్ధి అయ్యప్ప సమితి చైర్మన్ నల్ల తిరుపతయ్య గౌడ్ కోరారు. దాతల సహకారంతో ఇప్పటివరకు అయ్యప్ప ఆలయ నిర్మాణం పూర్తి చేశాము. దాతల సహాయ సహకారాలతో అన్నదాన సత్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు కార్యక్రమంలో గురు స్వాములు కొంగరి శ్రీనివాసులు, విశ్వేశ్వర్, గ్రామనాయకులు భాస్కర్ చందర్‌గౌడ్, కొండయ్య, గడ్డం మహేందర్, నారాయణటీచర్, ముచ్చర్ల యాదయ్య ,అడ్డాకుల పద్మమ్మ, నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఉందేకోడు కృష్ణయ్య, సేవా సమితి సభ్యులు సతీష్ సాగర్ ,దిగు తిరుపతి ,పల్లె చందర్ పల్లె జగన్, వెంకటం పల్లి రాజు, భీమయ్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

◆ బిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్ నవంబరు21 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని వారిని బిసిడి గ్రూప్ నుండీ బిసిఎ జాబితాలోకి చేర్చాలని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని రాజీవ్ చౌక్ ప్రేమ్ టైలర్ షాపులో సామాజిక కార్యకర్త నగనమోని మన్నెం ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశములో ముఖ్య అతిథిగా పాల్గొన్న వాకిటి శ్రీధర్‌మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని వారిని బిసిడి గ్రూప్ నుండీ బిసిఎ జాబితాలోకి చేర్చాలని అదేవిధంగా వారి వాట ప్రకారం చట్టసభలలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్(తెలుగు) సోదరులు సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాగనమోని మన్నెం చిరు వృత్తి చేస్తూ పేదరికంలో ఉన్న సుదీర్ఘకాలము నుండిసమాజ సేవలో ఉన్నారని సమాజంలో ఉన్న రుగ్మతల, మూఢనమ్మకాల పట్ల ప్రజలలో అవగాహన పరుస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి సొంత ఖర్చులతో హెల్మెట్లను బహుమతిగా ఇస్తూ ఆదర్శంగానిలుస్తూ ఇతరులకు స్ఫూర్తి కలిగిస్తున్నందుకు మన్నెంను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య కార్మిక పారిశ్రామిక సంఘం చీఫ్ ప్రమోటర్‌పుట్టబాలరాజు, శ్రీను, గంధం నాగరాజు, కురుమయ్య ,లక్ష్మయ్య, కొండన్నా ,బాలెమియ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదు

**పెబ్బేరు నవంబరు21 ప్రభాతవార్త:** పెబ్బేరు పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులను వనపర్తి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి అ వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష విధించడం జరిగినది. వై రంగారెడ్డి తండ్రి రామిరెడ్డి రాంపురం గ్రామం శివ తండ్రి కురుమన్న, శేరిపల్లి గ్రామం శ్రీరంగాపూర్ మండలం రాజు తండ్రి రాములు, సవాయిగూడెం గ్రామం వనపర్తి మండలం జి వెంకటేష్ తండ్రి జి.కృష్ణయ్య భూత్పూర్ గ్రామం, కొత్తకోట మండలంపెబ్బేరు మండల ప్రజలందరు మద్యం సేవించి వాహనాలు నడపరాదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించవలసిందిగా మద్యం సేవించి వాహనాలు నడిపిన, మైనర్ల చేతికి వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి

**లింగాల, నవంబరు 21 ప్రభాతవార్త:** వరి కొనుగోలు కేంద్రాలను ఎన్‌ఫోర్స్ మెంట్ డిటి హేమ్లానాయక్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తిసుకొచ్చే రైతులుతేమాశాతం కూడిన ధాన్యంతెచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తిసుకొచ్చే విధంగాకృషి చేయాలని సిఈఓపాండుకు సూచించారు. అంతకు ముందు సింగిల్‌విండో కార్యాలయంలో సంచుల నిల్వను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఈఓపాండురైతులు పాల్గొన్నారు.

## స్పింక్లర్‌లు దొంగతనం చేసిన ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు

**లింగాల నవంబరు 21 ప్రభాతవార్త:** స్పింక్లర్‌లను దొంగతనం చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. ఈనెల 16 తారీఖున మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన గాలి వెంకటయ్య చెందిన పొలంలో ఏడు స్పింక్లర్ లను దొంగతనం చేసిన గోలగుండం గ్రామానికి ఎల్లస్వామి, మాడాపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య, మల్లేష్ లపై కేసు నమోదు చేసుకుని గురువారం రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ఎరువుల దుకాణాల్లో ఏడిఏ ఆకస్మిక తనిఖీలు

**బిజినేపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త :** ఎరువుల దుకాణాల్లో నాగర్ కర్నూల్ ఏడీఏ వాసు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను, ఎరువులు, పురుగుల మందుల, నిల్వలను పరిశీలించి మాట్లాడారు. ప్రతి రైతుకు విక్రయించిన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారకాల బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. కల్తీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగుల మందులను విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణదారుడి లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన ఎరువులను, పురుగుల మందులను మాత్రమే రైతులకు ఇవ్వాలని స్వంతంగా అంటగట్టవద్దని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా వివిధ దుకాణాలు డీలర్ షాపులో ధరల పట్టికను స్టాక్ రిపోర్టులను, స్టాక్ రిజిస్టర్ లను నిల్వ ఉన్న స్టాక్ లను పరిశీలించారు. డీలర్లు నిలువలు తెచ్చుకునేటప్పుడు ఆథరైజ్డ్ సోర్స్ నుంచి తెచ్చుకోవాలని సూచించారు . ఎమ్మార్పీ ధర కంటే ఎవరైనా అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల నిలువలు తనిఖీలు చేశారు పెస్టిసైడ్ లైసెన్స్ ప్రిన్సిపల్ సర్టిఫికేట్ ఇంక్లూజన్ డీలర్లకు ముందస్తుగా చేసుకోవాలని తెలియజేశారు.

# తీరు మారలే..

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్, ఆసుపత్రి సూపరింటిండెంట్ కు సమాచారం అందించి విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు కోలుకుంటున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, క్షేమంగా ఉన్నారని కలెక్టర్ వెల్లడించారు. ఘటనలో బాధ్యులైన పాఠశాల హెచ్.ఎం ను సస్పెండ్ చేస్తూ, వంట ఏజెన్సీని రద్దు చేసి ఇతర ఏజెన్సీకి అప్పగిస్తున్నట్లు ఆమె తెలిపారు. అయితే వంట ఏజెన్సీ పై గతంలో కూడా ఆరోపణలు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతీ పాఠశాలలో టెస్టింగ్ (నాణ్యత పరిశీలన) కమిటీని ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాలలో బియ్యాన్ని, మార్కెట్ నుండి వచ్చే కూరగాయలు, కోడిగుడ్లు, పరిశీలించి పాఠశాలకు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పాఠశాలల హెడ్మాస్టర్లు, వంట ఏజెన్సీలు,ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. మాగనూరు కలుషిత ఆహారం ఘటన తాలూకు విచారణ నివేదికను సిద్ధం చేసిన కలెక్టర్ ఆ నివేదికను సీఎం కార్యాలయానికి సమర్పించనున్నారు.

# ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. మిస్సింగ్ కేసులపై దృష్టి సాధించాలని వెంటనే ట్రేస్ చేయాలని అధికారులకు సూచించారు. సామాజిక అంశాలపై లోకల్ పోలీసులు, షీ టీమ్స్, పోలీస్ కళాబృందం వారు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎన్ లింగయ్య, సిఐలు శివ శంకర్, దస్రునాయక్, రామ్ లాల్, చంద్ర శేఖర్, రాజేందర్ రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజు, కుర్మయ్య, రామ్ లాల్ , రమేష్, శిలీ నవీద్, మురళీ, బాగ్య లక్ష్మీరెడ్డి, అశోక్ బాబు, సునిత, వసంత, ఐటీ కోర్ టీమ్ తది తరులు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీకురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఆభరణాల పెట్టెను తీసుకెళ్ళేందుకు పోలీసులు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశారు. అక్కడినుంచి ప్రత్యేక వాహనంలో ఆత్మ కూరు లోని ఎస్బిఐ బ్యాంకులో ప్రత్యేక లాఖరులో స్వామివారి ఆభర ణాలను భద్రపరిచారు. కొనసాగనున్న జాత రశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిసిన జాతర కొన సాగనుంద.జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి భక్తులుస్వామివారిని దర్శించుకునేందుకు తరలి వస్తారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన కూడా స్వామివారికి భక్తులు మొక్క లు చెల్లించుకుంటారు.జాతర యధావిధిగా భక్తులతో కిటకిట లాడుతుంది.ఈ జాతర సుమారు 15 రోజులపాటు కొనసాగుతుంది.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్లయ్య, ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు, ఎస్సై ఆర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకి తరలించాలి : వనపర్తి అదనపు కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి నవంబరు 21 ప్రభాతవార్త:** సేకరించిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. గురువారం వనపర్తి మండల పరిధిలోని అంకుర్, ఘనపూర్ పరిధిలోని షాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నాణ్యమైన ధాన్యం అందించాల్సి ఉంటుందని అందువల్ల నిబంధనల ప్రకారం వరి ధాన్యం తేమ, తాలు, చెత్త లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు.సేకరించిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులకుఎప్పటికప్పుడు తరలించాలనిఅదేవిధంగా ఆన్లైన్ లో నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

# దివ్యాంగుల పట్టుదల కృషిని చూసి సవ్యాంగులు స్ఫూర్తి పొందాలి



ఆటల పోటీలో దివ్యాంగురాలు

**వనపర్తి ప్రతినిధి నవంబరు 21 ప్రభాతవార్త :** దివ్యాంగుల పట్టుదల కృషిని చూసి సవ్యాంగులు స్ఫూర్తి పొందాలని జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానాములో దివ్యాంగుల క్రీడా పోటీలను నిర్వహించగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ట్రై సైకిల్ పరుగు, చేస్, క్యారమ్, షార్ట్ ఫుట్ ఆటల పోటీలు నిర్వహించగా కలక్టర్ ట్రై సైకిల్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఏదో ఒక సమయంలో వైకల్యంతో బాధ పడతారని, లక్ష్య సాధనలో అది వైకల్యం మాత్రమే తప్ప అసాధ్యమైనది కాదని కలక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మమ్మ, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, జిల్లా దివ్యాంగుల సంఘం సభ్యులు, దివ్యాంగులైన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు . ఫొటోరైటప్ :21గద్వాల30: జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్

# మండల స్థాయి చెకుముఖి పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులు

**పెబ్బేరు నవంబరు 21 ప్రభాతవార్త:** పెబ్బేరు వేదికగా మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించరు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎనిమిదవ తొమ్మిదవ పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రభుత్వ పాఠశాల ఇంగ్లీష్ మీడియం విభాగంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.అదే విధంగా తెలుగు మీడియం విభాగంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు వీరితో పాటుగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విభాగంలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం లో నిలిచారు.

**ప్రైవేటు పాఠశాల విభాగంలో మాంటిసోరి విద్యార్థులు:** పెబ్బేర్ పట్టణంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ పోటీలకు పట్టణానికి చెందిన మాంటిస్ చౌరీ ప్లేయర్ స్కూల్ విద్యార్థులు ప్రతిప చాటారు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరందరూ తిరిగి ఈనెల 28వ తేదీన వనపర్తి లో జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారు.మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్, పుస్తకాల బహుకరణ చేయడం జరిగింది. అదేవిధంగా ఆదర్శ పాఠశాల పెబ్బేరు ప్రిన్సిపాల్ నరేష్ ఆధ్వర్యంలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతానికి సంబంధించిన పోస్టర్ని విడుదల చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు పెరుమాళ భాస్కర్,జిల్లా కోశాధికారి పినాగ శేషు,అదేవిధంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీవిద్య ,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరేష్,అదేవిధంగా వివిధ పాఠశాల నుంచి విద్యార్థులను తీసుకొచ్చిన గైడ్ టీచర్లందరూ పాల్గొన్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**ఇటిక్యాల, నవంబర్ 21 ప్రభాతవార్త:** అల్లంపూర్ పట్టణంలో వెలసిన ఐదవ శక్తిపీఠం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని గురువారంఖి మెదక్ ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు లు దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వీరి వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహమ్మద్ సిరాజ్. ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్

**నారాయణపేట టౌన్, నవంబరు 21 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం గనిమోని బండ గ్రామంలో శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు మాధవ రెడ్డి, పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు భక్తులు తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జనరంజక పాలన

◆ధూం..ధాంగా సాగిన కళా ప్రదర్శనలు ప్రతిబింబించిన తెలంగాణ సంస్కృతి

◆ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు



విజయోత్సవ కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

**గద్వాల, ఇటిక్యాల, నవంబరు 21 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ జనరంజక పాలనను అందిస్తోందని అదనపు రెవెన్యూ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు ఘనంగా జరిగాయి. అట్టహాసపు ఏర్పాట్లతో ఆహ్లాదకర వాతావరణంలో సాగిన కళాయాత్ర ప్రదర్శనలో బృందం ఆటపాటలతో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటుతూ, ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరింపజేశారు. ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ నరసింహారావు, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల అన్ని శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీయువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఎంతో ఆసక్తితో కళాకారుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48గంటలలోనే ఆరుగ్యారంటీలలో రెండు గ్యారంటీలను అమలు చేసిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలో మహిళలు,ట్రాన్స్ జండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించే వైద్య సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల ప్రభుత్వం పెంచిందన్నారు. ఈ పథకం కింద అందించే చికిత్సల సంఖ్యను కూడా 1835కి పెంచిందని ఆయన వివరించారు. ప్రగతి భవన్ ను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ గా మార్చి, ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు "ప్రజావాణి"కి శ్రీకారం చుట్టి, వారంలో రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. 500 రూపాయలకే వంటగ్యాస్ సిలెండర్ సరఫరా, గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగిస్తున్న గృహాలకుఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణాలో రైతులకు రూ. 31 వేల కోట్ల రూపాయల పంట రుణాలను మాఫీ చేసి అన్నదాతల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుందని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధరతో పాటు సన్న బియ్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తోందని తెలిపారు. ఏడాది కాలంలోనే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తూ, నిరుద్యోగ యువతలో భరోసా కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ ను ప్రకటించిందని గుర్తు చేశారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్స్, మెస్ చార్జీలనుగణనీయంగా పెంచిందని,పాఠశాలల బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తూ మౌలిక సదుపాయాలు పెంపొందిస్తోందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పరంగా ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ కోసం ఇంటింటి సమగ్ర సర్వే జరిపిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి సీఈవో కాంతమ్మ, అలంపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ, వడ్డేపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ కరుణ సూరి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, పిఎసిఎస్ డైరెక్టర్ సుభాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, కౌన్సిలర్లు,అన్ని శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీయువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్లకు మంజూరు అయిన రుణాలను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలి

◆వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి ప్రతినిధి నవంబరు 21 ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఇప్పటికే మంజూరు అయిన రుణాలను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారంజిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ రుణాల గురించి మాట్లాడుతూ 2018,19 లో స్వయం ఉపాధి కొరకు ఎస్సీ శాఖ ద్వారా మంజూరు అయిన 39 రుణాలను వేగంగా గ్రౌండింగ్ అయ్యేవిధంగా చర్యలుతీసుకోవాలన్నారు. కేంద్రభీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష భీమా యోజన పథకాలను ప్రజలందరికీ చేరువ చేయాలన్నారు. ఇవి చాలా ముఖ్యమైన పథకాలని, బ్యాంకర్లు అందరూ సీరియస్ గా ద్రుష్టి సారించాలని సూచించారు. ఆయా బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన ప్రతిఒక్కరికి భీమా పథకాలని అమలు చేయాలన్నారు. ముఖ్యంగా ప్రైవేట్‌బ్యాంకులలో ఈభీమా అమలు చాలా తక్కువగా ఉందని, సంఖ్య పెంచాలన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకానికి కేవలం సంవత్సరానికి రూ.430 కడితే రూ.2 లక్షల జీవితభీమా వస్తుందని, అదే ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే ప్రమాదం జరిగినప్పుడు పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష, శాశ్వత అంగ వైకల్యం ఏర్పడితే రూ.2లక్షల భీమా వస్తుందని అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి, స్థిర ఆదాయం వచ్చే నూతన యూనిట్లను స్థాపించి ప్రజలజీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలని అన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రాధాన్య రంగాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు.అన్ని వర్గాల్లో ఆర్థిక అక్షరాస్యత కల్పించాలి సమాజంలోని అన్ని వర్గాల్లో ఆర్థిక అక్షరాస్యత కల్పించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు. కాబట్టి అందరూ బ్యాంకర్లు సమాజంలో విభిన్న వర్గాల్లో ఆర్థిక అక్షరాస్యత కల్పించే దిశగా క్యాంపులను ఏర్పాటు చేయాలి అని సూచించారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలు,స్కూల్స్,కాలేజీలలో ఆర్థికఅక్షరాస్యత క్యాంపులను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందనాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లిఖార్జున్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, ఇండస్ట్రీస్ ప్రమోషన్ ఆఫీసర్ నగేష్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



ముదిరాజ్‌ల జెండాను ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాల నవంబరు21 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని తెలుగు పేట శివాలయం నందు గద్వాల మత్స్యకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మత్స్య కార్యదినోత్సవ సందర్భంగా తెలుగు ముదిరాజ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. తెలుగు ముదిరాజ్ జెండా ను ఎమ్మెల్యే కి చేతులకు మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఎమ్మెల్యే కి తెలుగు ముదిరాజ్ సంఘం నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. తెలుగు ముదిరాజ్ సోదరులు లందరికీ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యకారులు అభివృద్ధి చెందాలన్నారు.వారి కులవృత్తి అయిన చాపల వేటను మత్స్యకారులకు వృత్తిపరమైన వారికి అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వముకల్పించాలన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో మత్స్యకారులను కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా ప్రభుత్వం కూడా కృషి చేయాలని సీఎంకి కోరడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు ఎటువంటి ఇబ్బంది ఉన్న నా దృష్టికి తీసుకురండి ప్రత్యేకంగా వారికి నావంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అదే విధంగా మత్స్యకారుల అభివృద్ధి కొరకు వారు ఆర్థికంగా బలోపేతం చెంచడం కొరకు ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లి మత్స్యకారుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్ కౌన్సిలర్స్ దౌలు,టి.శ్రీను, నరహరి గౌడ్ రిజ్వాన్, నాయకులు గోవిందు సతీష్ వంట భాస్కర్,దౌలన్న లక్ష్మన్న,కురుమన్న, మధు హనుమంతు,ఆంజనేయులు, కొత్త గణేష్ పరశురాముడు, చందు, పాండు,హరి, నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ఆత్మకూరు నవంబరు21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సమస్యల పరిష్కారాన్ని కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త నిశ్చయంతో పని చేస్తున్నారని మస్యకారుల సమస్యల పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అన్నారు ప్రపంచ కార్మికదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ముత్యకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరమేశ్వర స్వామి చెరువుకట్ట సమీపంలో గల మత్స్యకారుల చేపల మార్కెట్ ఆవరణలో మత్స్య కార్మికుల జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 66 లక్షల జనాభా కలిగిన మత్స్యకారులు 44లక్షల ఓటర్లు కలిగి ఉన్నారని ఈ విషయాన్ని దృష్టిలోఉంచుకొని ఆనాటి రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మత్స్యకారులను బిసిడి గ్రూపు నుండిఏ గ్రూపులోకి మార్చేందుకు జీవో జారీ చేశారని తద్వారా కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయించడంతో నేటి వరకు అది పెండింగ్లో కొనసాగుతుందని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం సమస్యను అధిగమించి మత్స్యకారులను బిసిఏ లో చేర్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఈ విషయాన్ని రాష్ట్రవ్యాప్తంగా మత్స్య కార్మికులు దృష్టిలోఉంచుకోవాలని ఆయన సూచించారు. మత్స్యకారులు కేవలం చేపల వృత్తిని ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కులవృత్తిని నమ్ముకున్న మస్యకారులను ప్రభుత్వం ఎల్లవేళలా ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ కులవృత్తికి ఇవ్వలేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగామత్స్యకారులకు ఉచితంగా చేపల పంపిణీ తో పాటుగా చేయూతనిచ్చి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వ హయాంలోనిరాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటి నుండి శుభవార్త వినవలసిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. అంతకుముందుగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మండల పరిధిలోని బాలకృష్ణపూర్ గ్రామ సమీపంలో గల కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్టాపనకు సంబంధించి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోనికత్తెపల్లి గ్రామంలో తుజస్తంభ ప్రతిష్టాపనకు హాజరై భక్తులను పేరుపేరునా పలకరించి వేద పండితుల ద్వారా ఆశీర్వచనాలు తీసుకున్నారు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అన్ని వర్గాలను ఆదుకునేందుకు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు ఎల్లవేళలా తమ మద్దతు సంపూర్ణంగా ప్రకటించి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం నాయకులు అశ్విని కుమార్ ,గడ్డమీద శ్రీనివాసులు నాగేష్,దామోదర్,శివకుమార్ తదితరులతో పాటుగా ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ ,మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా ,మక్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులుతులసిరాజు యాదవ్ ,తదితరులతో పాటుగా పలువు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**కల్వకుర్తి, నవంబరు 21 ప్రభాతవార్త:**ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు కావాల్సిన సూచనలు సలహాలు అందించారు. ప్రధానంగా తేమ శాతం 14 మించకుండా ఉండాలని, తాలు, మట్టి పెడ్డలు లేకుండా శుభ్రం చేసిన ధాన్యం తీసుకొని రావాలని రైతులను చైర్మన్ కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్యామ్, మార్కెట్ కార్యదర్శి భగవంతు, వ్యవసాయ శాఖ ఎఓ సురేష్, డైరెక్టర్ వెంకటయ్య, రైతులు లక్ష్మారెడ్డి, దామోదర్‌రెడ్డి, శివయ్య, శంకర్, శేఖర్ రెడ్డి, పీఏసీఎస్ సిఈఓ వెంకట్‌రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

**ఊర్కొండ, నవంబరు 21 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలనిమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధ్యాప నిఖిల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఊర్కొండపేటలో హాజ్రత్ అమినోద్దీన్ ఒలియా120వ ఉర్సు ఉత్సవాలలో గురువారంరోజు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాధారం గ్రామ మాజీ సర్పంచ్ ధ్యాప నిఖిల్‌రెడ్డి పాల్గొని దర్శించుకుని ప్రత్యేక ఫాతిహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ నిర్వాహ కులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. అధికారులు,మైనారిటీ మత పెద్దలు,గ్రామ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులందరికీ మంచి రోజులే: ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి నవంబరు 21 ప్రభాతవార్త:** ప్రపంచ మత్స్యకార దినోత్సవ సందర్భంగా మత్స్యకార సోదరులందరికీ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో మత్స్యకారులందరికీ మంచి రోజులు వచ్చాయని మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మత్స్యకార కుటుంబాలను బీసీ డి గ్రూప్ నుంచి ఏ గ్రూప్ లోనికి మార్చడం, చేపలవేట చేసుకునేమత్స్యకారులందరికీ చెరువులపై పూర్తి హక్కులు కల్పించడం, ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయడం లాంటి అనేక కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని మత్స్యకారులు అందరికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంచి రోజులు రానున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘాల సభ్యులకు మత్స్యకారులకు మహిళలకు మత్స్యకార యువకులకు ఎమ్మెల్యే ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెండింగ్ సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లర్లు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**వనపర్తి ప్రతినిధి నవంబరు 21 ప్రభాతవార్త:** ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఇవ్వాల్సిన పెండింగ్ సీఎంఆర్ ధాన్యాన్ని రైస్ మిల్లర్లు నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఇవ్వాల్సిన పెండింగ్ సీఎంఆర్ ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతం వరి ధాన్యం కొనుగోలు జరుగుతున్న నేపథ్యంలో పిపిసి ల నుంచి మిల్లులకు ధాన్యం చేరిన అనంతరం అన్లోడ్ చేసుకునే విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ధాన్యాన్ని అన్లోడ్ చేసుకున్న తర్వాత ట్రక్ షీట్ అక్నాలెడ్జ్మెంట్ ను వెంటనే ఫోటో తీసి పిపిసి ఇంచార్జ్ కు వాట్సాప్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ సక్రమంగా పూర్తి అయితేనే రైతులకు సకాలంలో నగదు ఖాతాల్లో పడుతుందని చెప్పారు. సమావేశంలో సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, సివిల్ సప్లై డిఎం రమేష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు

**నారాయణపేట టౌన్, నవంబరు 21 ప్రభాతవార్త:** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం నారాయణపేట జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ముదిరాజ్ మహాసభ జెండాను ఎగరవేయడం జరిగింది,ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజ్ మరియు కాంతి కుమార్ మాట్లాడుతూ నారాయణపేట మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయడం జరిగింది, ప్రతి గ్రామంలో చెరువులు మరియు కుంటలను, ముదిరాజ్ సభ్యత్వం కొరకు 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ముదిరాజ్ సభ్యులకి ముదిరాజ్ సభ్యత్వం ఎలాంటి శరత్తులు లేకుండా ఎలాంటి వారి యొక్క సభ్యత్వాలు నమోదు చేయాలని, ప్రభుత్వాన్ని కోరడం జరిగింది, అలాగే రైతు బీమా మాదిరిగా మత్స్య కార్మికుల భీమను ప్రభుత్వం వారికి అందించాలని కోరారు. జిల్లా, రాష్ట్రంలోని నంబర్‌వన్ ఉత్పత్తి చాపల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇట్టి కార్యక్రమానికి హాజరైన అతిథులు మార్కెట్ కమిటీ నారాయణపేట చైర్మన్ సదాశివరెడ్డి ,జిల్లా డి ఎఫ్ ఎఫ్ రెహమాన్ ,మార్కెట్ వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, దామరగిద్ద పిఏసిసి చైర్మన్ ఈదప్ప, మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షులు నర్సింలు నాయుడు, జిల్లా డైరెక్టర్ ఆనంద్, రామకృష్ణ, హనుమంతు, శ్రీనివాసులు, లక్ష్మీకాంత్ ఎల్ఐసి, మారుతి ఎక్స్ కౌన్సిలర్, ముదిరాజ్ నాయకులు ముదిరాజ్ సభ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# పీఆర్‌టీయూసీ టీఎస్ మండల అధ్యక్షుడి నూతన గృహ ప్రవేశానికి హాజరైన ప్రముఖులు

**భూత్పూర్,నవంబరు 21,ప్రభాతవార్త:** పీఆర్‌టీయూ టీఎస్ భూత్పూర్ మండలశాఖ అధ్యక్షుడు సత్తూర్‌బాల్‌రాజ్‌గౌడ్ భూత్పూర్ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై గృహ వాస్తుపూజ, సత్య నారాయణ వ్రతంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్,మాజీ ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,ఎర్ర చంద్రశేఖర్,మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌లతోపాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో పాటు మాజీ ఎంఈఓ నాగయ్య,క్లస్టర్ సీఆర్పీలు ఇక్రమ్,ఠాగూర్,నాగేందర్‌లతో పాటు పలు పార్టీల నాయకులు బీఆర్ఎస్ నుంచి సత్తూర్ నారాయణ గౌడ్,టి మురళిధర్‌గౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,మేకల సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ సోదరుడు సత్తూర్ పవన్‌కుమార్ గౌడ్, సత్తూర్ అశోక్‌గౌడ్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్‌సత్తూర్ సదానంద్‌గౌడ్, సత్తూర్ రాకేష్‌గౌడ్,సత్తూర్ కృష్ణయ్యగౌడ్,సత్తూర్‌వెంకటేష్‌గౌడ్ బీజేపినుంచి సుదర్శన్‌రెడ్డి ,గంగాపురం రవీందర్‌రెడ్డి,చీపుర్ల భీంసేన్ కాంగ్రెస్ నుంచి గోవర్ధన్ గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

**పెబ్బేరు నవంబరు 21 ప్రభాతవార్త:**పెబ్బేరు పట్టణానికి చెందిన జర్నలిస్ట్ వెంకటేష్‌గౌడ్ నూతన గృహప్రవేశ కార్యక్రమం లో నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొని, వెంకట్‌గౌడ్‌ని అభినందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, తోమాలపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామన్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు మాచర్ల శ్రీనివాస్ గౌడ్ ,నాయకులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.